క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ నేతలకు పరామర్శ



లక్ష్మికి నివాళి అర్పిస్తున్న తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆరేటి సత్యనారాయణ సోదరి లక్ష్మి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు శనివారం పరామర్శించారు. తాము అండగా ఉంటామని అధైర్య పడవద్దని సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
చింతలపూడి: చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త బుదేటి ఆనంద్‌కుమార్ తల్లి తిమేలు అంత్యక్రియలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు హాజరై సంతాపం ప్రకటించారు. అనంతరం సీతానగరంలో ఇటీవల మరణించిన కనుమూరి చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయన వెంట విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి భరత్ రెడ్డి, ఎంపీటీసీ కలకొండ రాంబాబు, కోటగిరి మురళీ, నరేంద్రరాజు, శివ పలువురు కార్యకర్తలు ఉన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. శ్రీకాకుళంకు చెందిన మిట్టా అప్పలరామన్న ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఉచిత వైద్యశిబిరం

టి.నరసాపురం: మర్రిగూడెంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. చింతలపూడి మేజిస్ట్రేట్ చిన్నం మధుబాబు, జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం మర్రిగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి అక్కడి వసతి సదుపాయాలను పరిశీలించారు.

వ్యక్తి అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పేరంపేటలో పొలం సరిహద్దు తగాదాలో హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 2వ తేదీన పేరంపేటలో సరిహద్దు తగాదాలకు సంబంధించి చిలపరెడ్డి సుబ్బారెడ్డిపై అదే గ్రామానికి చెందిన మాకిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి సుబ్రహ్మణ్యం రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు ఏఎస్సై చెప్పారు. కాగా తీవ్రంగా గాయపడిన సుబ్బారెడ్డికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

జంగారెడ్డిగూడెం: స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్ఎన్‌డీపేటలో లైన్ ఇనెస్పెక్టర్‌గా పనిచేస్తున్న వైఆర్ఆర్ మోహన్‌రావును స్థానికంగా ఉండేలా రెగ్యులర్ చేయాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయాలని, లైన్‌మన్‌ల నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ప్రమోషన్లు వచ్చిన ఐదుగురిని వారి విల్లింగ్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండుగంటల అనంతరం ఈఈ రాధాకృష్ణ వచ్చి సమస్య పరిష్కరించడంతో ఉద్యోగులు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణంరాజు, వి.రాము, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు చిన్నం శ్యాంబాబు, కార్యదర్శి టి.మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం తాలూకా జ్యుడీషియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.సతీష్‌బాబు, కార్యదర్శిగా కె.ఏసుపాదం, ట్రెజరర్‌గా జి.మధుసూధనరావు, ఉపాధ్యక్షులుగా టీఆర్.రత్నకుమారి, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

రామరాజు ఔదార్యం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వెంకట రామరాజు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన చల్లగొల్ల ఓంకార్ అనే విద్యార్థికి ఇంజనీరింగ్ విద్య కోసం, హాస్టల్ ఫీజు నిమిత్తం కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంకు చెందిన సామాజిక వేత్త నాటకశాల వెంకట రామరాజు ఆర్థిక సహాయం అందజేశారు. ఓంకార్ ఇంజనీరింగ్ విద్యకు రూ.5 లక్షల అందజేస్తానని వెంకటరాజు గతంలో హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా ఫస్ట్ ఇయర్ రూ.60 వేలతోపాటు సెకండ్ ఇయర్ రూ.లక్షా 30 వేలు కలిపి శనివారం రూ.లక్షా 90 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంటీ సోషల్ క్లబ్ ఆవరణలో సభ్యులు సన్మానం చేశారు.

ప్రయాణం భయానకం

- వర్షాలకు అధ్వానంగా మారిన రహదారులు
- గోతుల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ఇక్కట్లు





యర్రగుంటపల్లి సెంటర్‌లో బురదమయంగా చింతలపూడి-సత్తుపల్లి ప్రధాన రహదారి, ఆదమిల్లి వద్ద ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు దుస్థితి

చింతలపూడి: అల్పపీడనం ప్రభావంతో మెట్ట ప్రాంతంలో గత నెలరోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. రహదారులపైనే గోతులు ఏర్పడి, అందులో వర్షం నీరు నిలిచిపోవడంతో గొయ్యి ఎక్కడుందో తెలియక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. చింతలపూడి, గురుభట్లగూడెం రోడ్డు, చింతలపూడి మెయిన్ రోడ్డు, సీతానగరం రోడ్డు, ఏలూరు చింతలపూడి ప్రధాన రహదారితో పాటు రాజుపోతేపల్లి అడ్డరోడ్డు నుంచి కామవరపుకోట, ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారుల్లో పలు ప్రాంతాల్లో వర్షాలకు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవడం, ప్రధాన రహదారులకు ఇరుపక్కలా కొందరు ఆర్అండ్‌బీ మార్జిన్లను ఆక్రమించి మట్టి పోయడంతో వర్షపు నీరు రోడ్లపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాక రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. కొద్దిపాటి వర్షాలకు సైతం రోడ్లు బురదగుంటల్లా మారుతున్నాయి. వర్షపు నీరు బయటికి పోయే అవకాశం లేక రోడ్లపైనే మోకాళ్లోతు నీరు నిలిచిపోతోంది. దీంతో రోడ్డుపై గుంటలు కనపడక వాహనదారులు వాటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

ప్రధాన రహదారులే కాక వర్షాలకు గ్రామీణ రహదారులు సైతం అధ్వానంగా తయారవుతున్నాయి. చిన్నపాటి వర్షాలకే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. చినుకు పడితే కనీసం నడవడానికి కూడా అవకాశం లేకుండా ఛిద్రమవుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చింతలపూడి పట్టణంలోని మారుతీనగర్, ఎన్‌వీఎస్ కాలనీ, ఆంథోని నగర్, గణేష్ కాలనీ, ఛార్లెస్ నగర్ వెళ్లే రహదారులు దయనీయంగా మారాయి. ఎన్ని ప్రణాళికలు పూర్తయినా గ్రామీణ రహదారుల తీరుతెన్నులు మారడంలేదు. గ్రామీణ రహదారుల దుస్థితిని మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు అభివృద్ధి చేయాలి



ప్రతి ఏటా వర్షాకాలంలో రోడ్లు అధ్వానంగా తయారవుతురన్నాయి. ఇటీవల నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్లు అభివృద్ధి చేయాలి.

– చిలుకూరి జ్ఞానారెడ్డి, ప్రగడవరం, చింతలపూడి

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



చింతలపూడి: సమ్మెటవారిగూడెంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



పోలవరం: సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో స్వర్ణకుమారి

చింతలపూడి: తల్లి పాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో పి.మాధవి అన్నారు. శనివారం చింతలపూడి సమ్మెటవారిగూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాలలో బిడ్డకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయనీ, అలాగే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. బిడ్డకు మొదటి 6 నెలలు తల్లి పాలే సంపూర్ణ ఆహారమన్నారు. అనంతరం తల్లిపాలతోపాటు అనుబంధ ఆహారం ఇస్తారని తెలిపారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి కాపాడతాయని చెప్పారు. పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో సైతం తల్లిపాలు సహాయపడతాయన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు మొదటి ఆరు నెలల వరకు కచ్చితంగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

● **జంగారెడ్డిగూడెం:** జంగారెడ్డిగూడెం సుందరయ్య నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో పి.బ్యూలా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు ముర్రుపాలు ఆవశ్యకతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టించాలని బ్యూలా తెలిపారు. బిడ్డకి తల్లిగా ఇచ్చే అదే మొదటి టీకా అని, జీవితకాలం కావలసిన వ్యాధినిరోధక శక్తిని అందించినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, ఝాన్సీ, కృష్ణకుమారి, సుబ్బాయమ్మ, సహాయకులు, ఆరోగ్య సిబ్బంది, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేయండి

పోలవరం రూరల్: పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇస్తే తల్లి బిడ్డ ఎంతో ఆరోగ్యంగా ఉంటారని పోలవరం ఐసీడీఎస్ పీవో యు.స్వర్ణకుమారి అన్నారు. పోలవరం మండల సమాఖ్య కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ప్రతి కేంద్రంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించాలన్నారు. ప్రతి కేంద్రంలో ఈ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఎంపీడీవో జి.శ్రీను, సూపర్‌వైజర్‌లు రాణి, మాధవి, విజయ పాల్గొన్నారు.

● **కొయ్యలగూడెం:** కన్నాపురం అంగన్‌వాడీ కేంద్రం-20 వద్ద తల్లిపాల అవగాహన వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో యుఎస్ స్వర్ణకుమారి తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం సీడీపీవో, సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతాలు, చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు, సూపర్‌వైజర్‌లు ఏ.నయోమీరాణి, జి.రాణి, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **బుట్టాయగూడెం:** మండలంలోని మారుమూల గ్రామమైన రెడ్డికోపల్లి, దొరమామిడి గ్రామాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల సమస్య పరిష్కారం

కొయ్యలగూడెం: తమ ధాన్యం సొమ్ముల బకాయిలు చెల్లించాలని గత నాలుగు రోజులుగా రైతులు చేస్తున్న ఆందోళనకు ధాన్యం వాపారులు దిగివచ్చారు. పోలవరం మండల రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసిన వివాదాస్పద వ్యాపారి నుంచి హామీ పత్రాలను డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పొందడంతో పరిష్కార మార్గం లభించింది. పోలవరం మండలానికి చెందిన రైతులకు బకాయి పడ్డ సొమ్ములు కొయ్యలగూడెం మండలానికి చెందిన ధాన్యం వ్యాపారస్తులు చెల్లించే విధంగా ఇరువర్గాల వారు ఒప్పంద పత్రాలను రాంబాబు సమక్షంలో పరస్పరం అందజేసుకున్నారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రైతు నాయకులు పసుపులేటి రాంబాబు, ధాన్యం వ్యాపారులు ఇరు మండలాలకు చెందిన రైతులు రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు సీపీఐ సహాయం



అల్లూరినగర్‌లో వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సీపీఐ నేతలు

వేలేరుపాడు: పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితులకు సీపీఐ నాయకులు శనివారం సహాయం అందించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గ భవాని, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి మన్నవ యామిని, స్థానిక నాయకులతో కలిసి అల్లూరి నగర్, జీడిగింపు, ఉదయ నగర్ తదితర గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి దుస్తులు, దుప్పట్లు అందించారు. విజయవాడకు చెందిన పాపులర్ షూ మార్ట్ సంస్థ, ఎఫ్ట్రానిక్స్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ దాతల సహకారంతో ఐదు లక్షల ఖరీదు చేసే వస్త్రాలను అందించామన్నారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వరద బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

పెద్దవాగు ప్రాజెక్టు వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ మండల కమిటీ కోరింది. ఈమేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, మండల రర్యాదర్శి సోయం చంద్రరావు మాట్లాడుతూ వరదపోటుకు నష్టపోయిన గ్రామాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యం, రోడ్లను మెరుగుపరిచి, మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని కోరారు. పార్టీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



బుట్టాయగూడెం: గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కిషోర్‌కుమార్

బుట్టాయగూడెం: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, అలాగే విద్యార్థి స్థాయి నుంచే చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి గురుకుల పాఠశాలలో శనివారం మండల న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధక చట్టాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కేఎస్ఆర్ తేజస్వి, బార్ ప్రెసిడెంట్ ముళ్లపూడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ విత్తనాల రాజు, సభ్యులు ఎస్సై కె.వెంకన్న పాల్గొన్నారు. అలాగే మర్లగూడెం కమిటీహాల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

● **లింగపాలెం:** ధర్మాజీగూడెంలోని సాయి జూనియర్, డిగ్రీ కాలేజీలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, చింతలపూడి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ మధుబాబు మాట్లాడుతూ తోటి విద్యార్థులతో స్నేహంతో మెలగాలన్నారు. దురుసుగా ప్రవర్తించడం, హేళన చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు.

పెద్ద మనసు చాటుకున్న దాతలు



జంగారెడ్డిగూడెం: వసుధ ఫౌండేషన్ సాయం



జంగారెడ్డిగూడెం రూరల్ : మానవత సంస్థ చేయూత



కొయ్యలగూడెం: విద్యాసామాగ్రి పంపిణీ



చింతలపూడి: కాపు నేతల ఆర్థిక సాయం

చింతలపూడి: చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో పలువురు దాతలు సాయం అందించి పెద్దమనసు చాటుకున్నారు. చింతలపూడి ఘంటా వారి వీధికి చెందిన సుంకర యామిని ఏపీ ఎంసెట్‌లో 7వేలు ర్యాంకు సాధించింది. కౌన్సిలింగ్‌లో ఏఎన్ఐటీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం లభించింది. అయితే కుటుంబ ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉండడంతో ఆమెను చదవించలేక ఆ కుటుంబం ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న చింతలపూడి శ్రీకృష్ణ దేవరాయ పట్టణ కాపు సంక్షేమ సంఘం యామిని చదువుకు తోడ్పాటు అందించింది. సంఘం ఆధ్వర్యంలో ఘంటా నాగభూషణం, తోట ఆదినారాయణ, పట్టణాధ్యక్షుడు తూము విజయ్‌కుమార్, సభ్యులు, దాతల సహకారంతో యామిని విద్యాభ్యాసం నిమిత్తం రూ. 41వేలు శనివారం అందజేశారు. ఆమె ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసేందుకు అవసరమైన పూర్తి సహకారం తాము అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల గణేష్, కొత్తపూడి శేషగిరిరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెంకు చెందిన దొడ్డిగర్ల సూర్యచంద్రరావు బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కనీసం మందులు కూడా కొనలేని పరిస్థితి. అతని వైద్యం నిమిత్తం వసుధ ఫౌండేషన్ సభ్యులు రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు. సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సభ్యుడు చోడె ఫణి చంద్రశేఖర్, కొండపల్లి పండు, కొండేపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టెన్నపాలెంకు చెందిన చింతలరావుల కృష్ణ ఇటీవల కామెర్లతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి మానవత సంస్థ 25 కేజీల బియ్యం, రూ.2 వేలు విలువైన నిత్యావసరాలు అందించి ఆదుకుంది. సంస్థ మండల అధ్యక్షుడు ఆకుల ధర్మరాజు, ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ, ఎలికే ప్రసాద్, ఆర్ రమేష్, ఆకుల సురేష్, రాకేష్, ఎం,కృష్ణ పాల్గొన్నారు.

చదువుకు తోడ్పాటు

కొయ్యలగూడెం: కన్నాపురం ఎంపీపీ స్కూల్‌కి చెందిన విద్యార్థులకు శ్రీవాసవి ఆర్య వైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం రూ.10 వేలు విలువైన విద్యాసామాగ్రిని అందించారు. 40 మంది విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ అందించి విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ కార్యదర్శి వెత్సా సత్యనారాయణ (పంగిడి), బొమ్మ వెంకట రామ గంట్లయ్య, బొమ్మ సూరిబాబు, గుడిమెట్ల సుబ్రహ్మణ్యం(చిన్నా), గుడిమెట్ల గంగాధరం, కోశాధికారి మట్టే శ్రీను, ఉప్పల మోహన్, అద్దేపల్లి కేశవ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు..

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. నారాయణపురం పంచాయతీ గుళ్లపాడుకు చెందిన గొన్నూరి బాపూజీ ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి తన బైక్‌పై వెళుతున్నాడు. గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి బంకులోకి వెళుతున్న బాపూజీ బైక్‌ను అన్నవరం నుంచి ద్వారకాతిరుమల వస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు బాపూజీకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చింతాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. రైతు అభ్యుదయ సంఘం, పాలకమండలి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆరు నెలలకుగాను రూ. 35 వేలు లభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారు నెలకొన్న ప్రదేశంలోనే గుడి విస్తీర్ణం పెంచడం, అదేవిధంగా అంకాల చెరువు (మెట్టినిల్లు) గట్టుపై ఉన్న అమ్మవారి ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కమిటీ తీర్మానం చేసింది.

సుందరేశ్వరునికి అన్నాభిషేకం



శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలోని శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి వారికి శనివారం అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు మావిళ్ళపల్లి దేవిసీతారాం ఆధ్వర్యంలో అమ్మవారితో సహా స్వామివారికి విశేష పూజలు, అభిషేక అర్చనాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకించిన అన్నాభిషేక ప్రసాదాన్ని అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేశారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కొయ్యలగూడెం: విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని గుర్తించి వారికి ఉచితంగా జిల్లా అంధత్వ సంస్థ ద్వారా కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరుగుతుందని కుంతలగూడెం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలోని 58 మంది విద్యార్థినీ విద్యార్థులకు కొయ్యలగూడెం పీహెచ్‌సీ కంటి వైద్యుడు సీహెచ్ చక్రవర్తి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగారావు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ప్రత్యేక శిక్షణ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని 5 మండలాల్లో బీఈడీ, డీఈడీ, టెట్ పాసై ఉపాధ్యాయ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న గిరిజన యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీఓ జి.శ్రీనుకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించి మహిళలకు రిజర్వేషన్ సదుపాయం కలదని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఎంపికైన 100 మంది అభ్యర్థులకు ఆగస్టు 3వ వారం సుమారు 90 రోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను కేఆర్‌పురం ఐటీడీఏ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 96039 94333, 94902 85277 నంబర్‌లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నాగులగూడెంలో సంబరాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంతో ఎస్సీ వర్గీకరణలో ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు న్యాయం జరిగేలా తీర్పు వచ్చిందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు విస్సంపల్లి సిద్ధు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ నాగులగూడెంలో సంబరాలు నిర్వహించారు. బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.